
గట్టు: ఎమ్మెల్యే బండ్ల ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

- గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- మోసగాళ్ల మాటలు నమ్మితే నట్టేట మునగడం ఖాయం
- కుల,మతాలను రెచ్చగొట్టేలా కాంగ్రెస్ అభ్యర్థి ప్రసంగం
- ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- గద్వాలలో రోడ్ షో, గట్టు మండలంలో ప్రచారం

# ఆదరిస్తే మరింత అభివృద్ధి

గద్వాల, నవంబర్ 24 : ''కాంగ్రెస్‌కు ప్రజలు 50 ఏండ్లు అధికారం ఇచ్చారు. ఈ కాలంలో వాళ్లకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదు. వాళ్ల పాలనలో కరెంట్, తాగు, సాగునీటి కోసం నానా కష్టాలు పడ్డారు. ఇప్పుడు అధికారం ఇస్తే అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయకుండా ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తున్నారు.'' అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 26, 27, 36 వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించగా ప్రజలు కుంకుమ పెట్టి, పూలు చల్లుతూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మాలిమ్ షబ్బీర్ గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కొంతమంది బీఆర్ఎస్ పార్టీ ద్వారా కేబినెట్ హోదాలో పదవులు వెలగబెట్టి జిల్లా అభివృద్ధిని మరిచి స్వలాభం చూసుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం బహుజన వాదం ముసుగులో ఓట్లు అడుగుతూ ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారు చెప్పే మాయమాటలు, సినిమా డైలాగులు విని మోసపోతే మరో ఐదేండ్లు గోస తప్పదన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి గద్వాల మున్సిపాలిటీని అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని కోరారు. 50ఏండ్ల కాంగ్రెస్ పాలన, పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూసారు.. అభివృద్ధిని బేరీజు వేసుకొని రాబోయే ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలన్నారు. ప్రతి వార్డులో పల్లె ప్రకృతి వనాలతోపాటు సీసీరోడ్లు, డ్రైన్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచేది లేదని జోస్యం చెప్పారు. అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని సూచించారు. ఇక్కడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మున్సిపాలిటీ అభివృద్ధి గురించి మాట్లాడుతుందని.. ఇంట్లో కూర్చుంటే కనిపించదు.. బయటకొచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. మాయమాటలను ప్రజలు నమ్మరని, అహంకార ధోరణితో మాట్లాడే వారిని గమనించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసే డ్రామాలను చూసి గద్వాల ప్రజలు మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్‌ను ఆదరిస్తే మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు మురళి, మహేశ్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం..**

గద్వాల అర్బన్, నవంబర్ 24 : పదేళ్లలో గద్వాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నాం.. మరోమారు ఆదరిస్తే భవిష్యత్తుకు బంగారు


గట్టు: పటాకులు కాల్చుతున్న ఎమ్మెల్యే బండ్ల

బాటలు వేసుకుందామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలం తప్పెట్లమెర్సు, మల్దకల్ మండలంలోని పెద్దొడి, గద్వాల మండలం కాకులారానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోసగాళ్ల మాటలు నమ్మి ఓటేస్తే నట్టేట మునగడమే తప్పా.. తేలడం ఉండదన్నారు. అప్రమత్తంగా ఉంటూ రెచ్చగొట్టే వ్యక్తులకు ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణారెడ్డి, తిమ్మప్ప, నర్సింహులు, తిమ్మప్పగౌడ్ తదితరులున్నారు.

**కల్లబొల్లి మాటలు నమ్మొద్దు**

గట్టు, నవంబర్ 24 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బలిగేర, మాచర్ల, గట్టులో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. బలిగేర, మాచర్లలో జెడ్పీటీసీ శ్యామల, సర్పంచులు హనుమంతు, సిద్ధిరామప్పతోపాటు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు కన్నెతి చూడని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. వారి మాటలు నమ్మొద్దని సూచించారు. బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టంచేశారు. ఓటర్లు చైతన్యవంతులై ప్రజాకర్షణ పథకాలతో ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కు మరోసారి అధికారం కట్టబెట్టాలని కోరారు. కాంగ్రెస్ హామీలను ఎవరూ నమ్మరన్నారు. కార్యక్రమంలో కన్జ్యూమర్ ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు రామన్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నతాండ్రపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

- సీఎం కేసీఆర్‌తోనే పల్లెల ప్రగతి
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ రూరల్, నవంబర్ 24 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఆగం కావాల్సిందేనని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. శుక్రవారం చిన్నతాండ్రపాడు, నౌరోజీ క్యాంప్, కేశవరం, వేణిసోంపురం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై పూలు చల్లుతూ చల్లాకు స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ పాలనలోనే పల్లెలు ప్రగతి సాధించాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెసోళ్ల మాయమాటలు ప్రజలు నమ్మొద్దని సూచించారు. కారు గుర్తుకు ఓటు వేసి అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని సూచించారు. ప్రచారంలో సింగిల్విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్యారెడ్డి, రాముడు, నర్సింహారెడ్డి, ప్రహ్లాదరెడ్డి, భద్రయ్య, నర్సోజీ, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**విజయుడిని ఆశీర్వదించండి**

అయిజ, నవంబర్ 24 : అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ ఆర్డీఎస్, నెట్టెంపాడ్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ చల్లా అన్నారు. శుక్రవారం రాత్రి ఉప్పల, ఉప్పల క్యాంప్, పర్దిపురం గ్రామాల్లో అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి తరపున ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. వచ్చే ఐదేళ్లలో ప్రజల అవసరాలకనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోను తు.చ. తప్పకుండా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలంపూర్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విజయుడికి తమ అమూల్యమైన ఓటు వేసి, వేయించి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.


అయిజ రూరల్: ప్రచారంలో పాల్గొన్న అశేష జనం

- మరోసారి బీఆర్ఎస్‌దే విజయం
- గులాబీ మ్యానిఫెస్టోలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం
- ఓటమి భయంతోనే ముఠాల ఏర్పాటు
- అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

# మల్లమ్మకుంటను నిర్మిస్తాం


వడ్డేపల్లి: బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న విజయుడు, శ్రీనివాసులు

వడ్డేపల్లి, నవంబర్ 24: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి వస్తున్న ఆదరణ చూసి ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెసోళ్లు ముఠాలు కడుతున్నారని, ఎంతమంది ఎదురొచ్చినా సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు స్పష్టం చేశారు. శుక్రవారం మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్‌తో కలిసి విజయుడు వడ్డేపల్లి, రాజోలి మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, అభిమానులు వీరికి ఘనస్వాగతం పలికారు. తనగలలో మల్లమ్మకుంట రిజర్వాయర్ పూర్తి చేయిస్తామని, ఏ రైతుకూ నష్టం కలిగించమని, భూములు కోల్పోయిన రైతులతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని విజయుడు హామీ ఇచ్చారు. వడ్డేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ చల్లా బలపర్చిన అభ్యర్థి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించి మన ప్రాంతాన్ని ఇంకా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, వృద్ధులకు రూ.3వేల నుంచి రూ.5వేలకు పింఛన్ పెంపు, ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల బీమా, గృహ లక్ష్మి వంటి పథకాల ద్వారా మరింత లబ్ధి పొందవచ్చన్నారు. ప్యాకేజీలకు అమ్ముడుపోయి పార్టీలు మారే వ్యక్తుల మాటలు నమ్మొద్దు.. మనకు మేలు చేసే కారు గుర్తుకే ఓటెయ్యాలని వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అజయ్‌కుమార్, సర్పంచ్ రాణి, నాయకులు ఆంజనేయులు, వెంకటేశ్, లక్ష్మణస్వామి, భరత్‌బాబు, జూలేకల్ వెంకటన్న, లక్ష్మిరెడ్డి, ఉదయ్, మహేశ్, తిమ్మాజిపల్లె శేఖర్, రాజు, బండి శ్రీను, జిక్కిరెడ్డి పల్లె వెంకటేశ్, సుంకన్న, రామాపురం తిక్కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలి**

రాజోళి, నవంబర్ 24 : ప్రజలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు కోరారు. శుక్రవారం రాజోళిలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులుతో కలిసి నసనూర్, పచ్చర్ల, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కేసీఆర్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. ఎమ్మెల్సీ చల్లా ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందామని, ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజయుడు కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో అన్ని వర్గాలకు ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే అలంపూర్ అంధకారంలోకి వెళ్తుందని వివరించారు. సీనియర్ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్డీఎస్ రైతులు మరోసారి కారు గుర్తుకు ఓటేసి విజయుడిని గెలిపిస్తే చల్లా నాయకత్వంతో మూడు రిజర్వాయర్లు ఏర్పాటు చేసుకొని నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చంద్రగౌడ్, యువ నాయకుడు అజయ్‌కుమార్, సింగిల్విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పచ్చర్ల సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, నారాయణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజోళి: ఓటు అభ్యర్థిస్తున్న విజయుడు

## లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

గద్వాల అర్బన్, నవంబర్ 24 : సాధారణ ఎన్నికల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను సాధారణ ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం గద్వాల మండలం గోనుపాడు సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న రెండు నియోజకవర్గాల ఎన్నికల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలను పోలీస్ ఎన్నికల పరిశీలకులు అనుపమ్‌శర్మ, కలెక్టర్ క్రాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు జరిగే ముందు ఈవీఎంల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసే గదులను పరిశీలించాలన్నారు. పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చెక్ చేశారు. లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, బారికేడ్లు, పార్కింగ్, మీడియో సెంటర్ అన్ని వసతులు కల్పించాలని సూచించారు. మరమ్మతులు చేపట్టి పనులు పూర్తి చేయించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నర్సింహులు, డీఈ కిరణ్‌కుమార్, డీపీఆర్వో చెన్నమ్మ, అధికారులు పాల్గొన్నారు.